SNR ఫౌండేషన్ ఛైర్మన్, వీ3 న్యూస్ ఛానల్ గౌరవ సలహాదారుడు డా. సామల వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రికల సీఎండీ డా.కాచం సత్యనారాయణ.

పదేండ్లలో హిందువుల అభ్యున్నతికి బీజేపీ చేసిందేమిటి

- సీపీఐ నేత కూనంనేని

విశ్వంభర, హైదరాబాద్ : పదేండ్లుగా కేంద్రంలో అధికారం చెలాయిస్తూ హిందుత్వ మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం అదే హిందువుల అభ్యున్నతికి ఏమి చేసిందో చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' అంటున్న బీజేపీ దేశంలో 99 శాతంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల బతుకులను వినాశనం చేస్తూ, కేవలం ఒక శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులకు సంపద అంతా దోచిపెడుతోందని అగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ కేంద్ర పాలకులకు హిందువులైనా, ఇతరులపైనా అభిమానం లేదన్నారు. కేవలం మతాలను, కులాలను అడ్డం పెట్టుకుని అధికారం చలాయించడమే వారి లక్ష్యం అన్నారు. బీజేపీ నేతలు చెబుతున్న రామరాజ్యం అంటేనే అందరిని సమానంగా చూడడమని కూనంనేని గుర్తు చేశారు. కానీ, బీజేపీ నేతలు చెబుతున్న దేమిటో, చేస్తున్నదేమిటో ప్రజలు గమనించాలని కోరారు. హిందువులంటే ప్రేమ అంటున్న నేతలు ఈ దేశంలో పేద హిందువుల అభ్యున్నతికి తీసుకున్న చర్యలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ వైఖరే బీజేపీకి బలం

గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రగతిశీల శక్తులు, లౌకిక పార్టీలు కలిసి ఇండియా కూటమిగా ఏకమై రాజకీయంగా బీజేపీ బలాన్ని తగ్గించగలిగామని కూనంనేని తెలిపారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి కారణంగా మళ్లీ బీజేపీ బలం పుంజుకున్నదని, ఇది ఈ దేశానికే అత్యంత ప్రమాదకరంగా మారనుందన్నారు. ఢిల్లీలో ఆప్ ఓటమితో బీజేపీ మరింత రెచ్చిపోయే అవకాశం లభించిందని, ఇందుకు ఇండియా కూటమికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ, దాంతోపాటు ఇండియా కూటమిని కాదని ఒంటరిగానే బరిలోకి దిగుతామని మొండి వైఖరి అవలభించిన ఆప్ అధినేత కేజ్రీవాలే కారణమన్నారు. ఆప్ కేవలం 2 శాతం ఓట్ల తేడాతో ఢిల్లీలో అధికారం కొల్పోయిందని, అదే కాంగ్రెస్ 6 శాతం ఓట్లు వచ్చాయని, ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసి ఉంటే తప్పక మరో సారి ఆప్ అధికారం చేపట్టేదని తెలిపారు. అయితే, కేజ్రీవాల్ పై ఉన్న కేసులను అడ్డం పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఆయనను బెదిరింపులకు గురిచేసిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఉదారభావంతో వ్యవహరించి ఇండియా కూటమిని ఏకతాటిపై నడిపేలా చర్యలు తీసుకోవాలని కూనంనేని పేర్కొన్నారు. లేకపోతే బీజేపీ మరింత బలపడి దేశ ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారుతుందని తెలిపారు.

బీజేపీ ప్రేరణతోనే దాడులు..

చిలూకూరి బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం సంస్థ ముసుగు ధరించి దాడిచేయడం గర్హనీయమని కూనంనేని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ వంటి సంస్థల ప్రేరణతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. దాడులకు పాల్పడినవారిని తక్షణమే గుర్తించి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టులు ఈ దేశ ప్రజలు కాదా?..

మావోయిస్టులనే పేరుతో ఈ దేశ ప్రజలపై యుద్ధం ప్రకటించి వారిని అత్యంత కిరాతకంగా మట్టు పెడతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారికంగా ప్రకటించడం దుర్మార్గమని కూనంనేని అన్నారు. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధమని, దీనిపై అంతర్జాతీయ న్యాయస్థానంతో పాటు ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని ఇందుకు కారణమైన కేంద్రమంత్రి అమిత్ శిక్షించాలని కోరారు. అదేవిధంగా సుప్రీంకోర్టు సైతం ఎన్ కౌంటర్ విచారణ నిర్వహించి ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విజప్తి చేశారు. మావోయిస్టుల అన్ని చర్యలను తాము సమర్థించడంలేదని, ప్రజల కోసమని అడవి బాట పట్టి పోరాడుతున్న మావోయిస్టులు అసలు ఎందు కోసం చని పోతున్నారో ప్రజలు కనీసం గుర్తించడంలేదని విషయాన్ని గుర్తించుకోవాలని హితువు పలికారు. ఈ దేశంలో విప్లవం ద్వారా రాజ్యాధికం వచ్చే పరిస్థితులు ప్రస్తుతం లేవని, ఈ నేపథ్యంలో వారు పునరాలోచన చేసుకోవాలని సాంబశివరావు కోరారు.

పొత్తులు పొత్తులే.. పోరాటం పోరాటమే..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి సిపిఐ ముందుకు సాగుతున్నా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గళం వినిపిస్తూనే ఉంటామని కూనంనేని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తద్వారా ఆర్టీసీ కార్మికుల సమ్మెను నివారించాలని ప్రభుత్వానికి సూచించారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సంస్థ నిర్వహించాలని, ఈ విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.

కలిసి వచ్చే పార్టీలతో స్థానిక ఎన్నికల పొత్తులు..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వైఖరిపై ఆ పార్టీతో తమ పొత్తు ఆధారపడి ఉంటుందని కూనంనేని వెల్లడించారు. కాంగ్రెస్ కలిసి వస్తే ఆ పార్టీతో ముందుకు సాగుతామన్నారు. లేకపోతే సిపిఐకి బలం ఉన్న చోట్ల ఒంటరిగా పోటీ చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. ఇదే సమయంలో బీజేపీ మినహా కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకునేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్ సీ ఎన్నికల్లో కరీంనగర్ పట్టభద్రుల ఎంఎల్ సీ స్థానానికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటించామని సాంబశివరావు వెల్లడించారు. మిగిలిన టీచర్స్ ఎంఎల్ సీ స్థానాలకు సంబంధించి ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం నాయకులు చర్చలు జరుపుతున్నారని, చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

కేసీఆర్ నగర్‌పై నీలి నీడలు..

ఓటర్ లిస్టులో లేని లబ్ధిదారుల పేర్లు..

విశ్వంభర, సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్ పై నీలినీడలు కమ్ముకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల పట్టణ వాసుల కోసం 1320 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం చేసి, లబ్ధిదారులకు అందించారు. ఇక్కడ 110 బ్లాక్‌లలో 1320 డబుల్ బెడ్ రూమ్‌స్‌లో మొత్తం జనాభా సుమారు 6వేల వరకు ఉంటుంది. 1340 మంది ఓటర్లు ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఏడాది క్రితం గ్రామపంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగియంతో కేసీఆర్ నగర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక్కడ మౌలిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఆందోళన చేశారు.కలెక్టర్‌తో పాటు అధికార పార్టీ నేతలు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామన్నప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం గ్రామపంచాయతీ, జిల్లా మండల పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడంతో ఒక్కడి ప్రజలకు ఆశలు చిగురించాయి. తమ కేసీఆర్ నగర్ ప్రత్యేక గ్రామపంచాయతీగా ఆవిర్భావంతో పాటు పాలకవర్గం వస్తుందని ఆశపడ్డారు. పాలకవర్గం వస్తే సమస్యలు తామే పరిష్కరించుకోవచ్చని అనుకున్నారు. ఇటీవల అధికారులు సర్వే చేసినప్పటికి కేసీఆర్ నగర్‌పై ఎటూ తేల్చలేదు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఉంచుతారా..? లేదా ఏదైనా గ్రామపంచాయతీలో కలుపుతారా..? అనేది అధికారులు తేల్చలేదు. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం అధికారులు పోలింగ్ కేంద్రాలు ఓటర్ జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో కేసీఆర్ నగర్ లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఇలా ఉండగా సిరిసిల్లకు 10 కిలోమీటర్ల ఉన్న కేసీఆర్ నగర్ వాసులు, సిరిసిల్ల ఉన్న తమ ఓట్లని కేసీఆర్ నగర్ మార్చుకున్నామని తెలిపారు. తీరా ఎన్నికల అధికారులు ప్రకటించిన జాబితాలో పోలింగ్ కేంద్రాలతో పాటు ఓటర్ జాబితా కూడా ప్రకటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. తాము బతికున్నట్లా.. లేదా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కెసిఆర్ నగర్ కాలనీ ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు లేనియెడల ఆందోళన చేస్తామని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై ఎంపీడీవో లక్ష్మీనారాయణ వివరణ కోరగా, కేసీఆర్ నగర్ ఓటర్ జాబితాను కలెక్టర్కు పంపించామని, కేసీఆర్ నగర్ ను ఇందిరమ్మ కాలనీలో కలుపుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించినట్లు తెలిపారు.

ఆరు నెలల్లో కాంగ్రెస్ సర్కార్ కుప్పకూలడం ఖాయం..

- తేల్చి చెప్పిన ఎర్రబెల్లి

విశ్వంభర, పెద్ద వంగర: బ్రోకర్ మాటలతో రేవంత్ రెడ్డి అధికారం చేపట్టారని, గత 15 నెలల పాలనలో అభివృద్ధి శూన్యమని ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ నాయకుల సమీక్షా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి దయాకర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి పనులు శూన్యం అని స్పష్టం చేశారు. అభివృద్ధి పథకాల్లో పేర్ల మార్పుతోనే ఎంతో అభివృద్ధి చేశామని కాంగ్రెస్ ఆనందంలో ఉందన్నారు. తేదీల్లో మార్పు, దేవుళ్లపై ఓట్లు సీఎం రేవంత్ రెడ్డి తీరని దయాకర్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డికి, పార్టీ ఎమ్మెల్యేలకు సమన్వయం కొరబడిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధిష్టానంలో ఒక తీరు రాష్ట్రంలో ఒక తీరు జరుగుతుండడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు వస్తే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సీఎం కావడంతోపాటు బీఆర్ఎస్ పార్టీకి 100 సీట్లు రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, వృద్ధులకు పెన్షన్లతోపాటు కౌలు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అన్ని పూర్తి చేశామని ప్రకటనలు చేయడం సిగ్గుచేటు అన్నారు.రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీలో సమన్వయం లేక ఇప్పటికి మంత్రివర్గ విస్తరణ చేయలేదని దయాకర్ రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి సమాచారం లేకుండానే వరంగల్ పర్యటనకు వస్తానని రాహుల్ గాంధీ ప్రకటించడం లోనే ఇది అర్థమవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జెడ్పీటీసీలు టీఆర్ఎస్‌కే రావడం ఖాయమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని పిలుపునిచ్చారు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని ఏ ఒక్కరు అధైర్య పడొద్దని హామీ ఇచ్చారు.

కళాకారులకు పునర్జన్మనిస్తున్న త్యాగరాయ గానసభ

- వారిని గురువులుగా తయారు చేసే గొప్ప వేదిక
- డా.కాచం సత్యనారాయణ గుప్త

విశ్వంభర, హైదరాబాదు: హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గానసభ కళా వెంకట దీక్షితులు హాలులో బింగి నరేందర్ గౌడ్ జన్మదినం సందర్భంగా బుధవారం రాత్రి సయ్యద్స్ వాయిస్ మ్యూజికల్ ఈవెంట్స్ గుంటూరు వారి ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా బింగి నరేందర్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రికల సీఎండీ, కాచం ఫౌండేషన్ అధినేత, విద్యావేత్త డా.కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ త్యాగరాయ గానసభ కళాకారులకు పునర్జన్మనిస్తుందని అన్నారు.కళాకారులకు తమ ప్రతిభను పదిమందికి తెలియజేస్తూ మరో స్థాయి వైపుకు తీసుకెళ్లి వారి గుర్తింపును మరింత పెంపొందించుకునేందుకు దోహదపడుతుందని ఈ వేదిక కళాకారులను గురువులుగా తయారుచేసిన గొప్ప వేదిక అని అన్నారు. సాహిత్యంలో సేవలందిస్తున్న డాక్టర్ రఘు ను, వైద్యరంగంలో మహిళలకు అనేక సేవలను అందిస్తున్న డాక్టర్ నర్మద లను బింగి నరేందర్ గౌడ్, కాచం సత్యనారాయణ గుప్తాలు సత్కరించారు. అనంతరం పాటలతోఅహుతులను అలరించిన గాయకులను సత్కరించారు.

కడియం ఊరబిసిక లాంటోడు

- పంట ఎక్కడ పచ్చగుంటే అక్కడే..
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

విశ్వంభర, పెద్ద వంగరః రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో సమన్వయం కొరవడి, ప్రజలకు పథకాల అమలులో అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఊరబిసికలాండోడని, పంట పచ్చగున్న చోటే ఆయన ఉంటాడన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ నాయకుల సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు ఎట్లా గెలిచారో వాళ్లకే అర్థం కాక తర్జన భర్జన పడుతున్నారన్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం లేని వారు ఒకవైపు..సభ్యత్వం ఉన్నా, మొదటి నుంచి పని చేస్తున్న వారు ఒకవైపు ఉన్నారని, దీంతో సమన్వయం కొరవడిందని పెద్ది సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు కడియం శ్రీహరి ఊరబిసికలాంటోడని పంట ఎక్కడ పచ్చగుంటే అక్కడే ఉండే రకమని విమర్శించారు. రేవంత్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే పూటకో మాట, లంచ్‌కు ముందు ఓ మాట, లంచ్ తర్వాత మరో మాట మాట్లాడతారన్నారు. మంత్రుల మాటలు సైతం పొంతన లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ రాష్ట్రానికి పెట్టుబడులతో ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేశారని పెద్ది సుదర్శన్ రెడ్డి చెప్పారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నదన్నారు. సంక్షేమ పథకాలను గాలికి వదిలి ఢిల్లీ పర్యటనలు, విదేశాల పర్యటనలు తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతుకు ఎలాంటి కష్టాలు లేకుండా తాగు సాగు నీటి కష్టాలు లేకుండా చేశారన్నారు. ప్రతి ఆరు నెలలకు పంట పెట్టుబడి సహాయం అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటికీ ఏ ఒక్క రైతుకు పూర్తిస్థాయిలో రైతు బంధు ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. పథకాల అమలు కోసం తేదీలు మార్చడమే తప్ప ప్రజలకు హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు యాదగిరిరావు, సోమనరసింహారెడ్డి, మాజీ దేవస్థానం చైర్మన్ రామచంద్ర శర్మ, నాయకులు సుధీర్ కుమార్, రాము, రవి, బిక్షపతి, మండల యూత్ అధ్యక్షుడు హరీష్ యాదవ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జెఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణలోని సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు జెఈఈ మెయిన్‌లో తమ ప్రతిభను కనబర్చారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జెఈఈ మెయిన్-2025 మొదటి విడత పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో సాంఘి సంక్షేమ గురుకులాల ప్రతిభ కేంద్రాలు గత సంవత్సరం కంటే మెరుగైన పర్సంటేజీలు సాధించి కార్పొరేట్‌కోచింగ్ సెంటర్లకు ధీటుగా తమ సత్తాను మరోసారి నిరూపించాయి. మొత్తంగా సంక్షేమ గురుకులాల ప్రతిభ కేంద్రాల నుంచి 415 మంది జెఈఈ(అడ్వాన్స్‌డ్) 2025 పరీక్షకు గత సంవత్సరం కట్ ఆఫ్‌ఆధారంగా అర్హత సాధించారు. వీరిలో గౌలిదొడ్డి ప్రతిభ కేంద్రం నుంచి విద్యార్థులు అత్యధిక పర్సంటేజీలు సాధించారు. విద్యార్థులు సాధించిన విజయంతో పేదరికం అడ్డుగోడ కాదని ఆత్మవిశ్వాసంతో నిరూపించారు.

ఈ సందర్భంగా విజయాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన సిబ్బంది సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎస్సీడీడీ ప్రిన్సిపాల్‌సెక్రటరీ ఎన్‌శ్రీధర్, గురుకులాల కార్యదర్శి డాక్టర్‌అలుగు వర్షిని ప్రత్యేకంగా అభినందించారు. అయితే, ప్రతి ప్రతిభ గురుకుల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి సంస్థ తీసుకున్న నిర్ణయాలతో మంచి ఫలితాలు సాధించడం జరిగిందని తెలంగాణలోని సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ పేర్కొన్నది. ముఖ్యంగా బదిలీల ద్వారా అనుభవజ్ఞులైన ప్రధానాచార్యులను, నిష్టాతులైన బోధనా సిబ్బందిని నియమించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే, మైక్రో - షెడ్యూల్‌ని పటిష్టంగా అమలు పర్చడం జరిగిందన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా నిరంతరం పర్యవేక్షణతోపాటు వారాంతపు, మాక్ పరీక్షలు నిర్వహించడం, ప్రతి విద్యార్థికి అనుగుణంగా కౌన్సిలింగ్ ఇవ్వడం ఫలితాలు సాధించడంలో ఎంతో దోహదపడిందన్నారు. 2025 ఏపరల్ మొదటి వారంలో జరగబోయే జెఈఈ మెయిన్ రెండ విడత పరీక్షలో మరింత మంది విద్యార్థులు అత్యధిక పర్సంటేజీ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు పరుచడం జరుగుతుందని గురుకులాల కార్యదర్శి డాక్టర్ అలుగు వర్షిని తెలిపారు.

అత్యుత్తుమ పర్సంటేజీలు సాధించిన స్టూడెంట్స్..

ఆర్.మణిదీప్-99.03, కె.చరణ్‌రాజ్-98.30, డి.తేజస్వీని-98.267, పావ్‌శ్రీనివాస్- 96.88, జె.రామచరణ్‌తేజ - 96.78, ఎం.భవ్యశ్రీ- 95.75, భానుతేజ - 95.49, సుజల - 95.49, కె.చరణ్‌తేజ్ - 95.20, కె. కీర్తన -95.07

పర్సంటేజీ సాధించిన విద్యార్థులు..

90కిపైగా పర్సంటేజీ సాధించిన విద్యార్థులు - 28
8090 పర్సంటేజీ మధ్య సాధించిన విద్యార్థులు - 111
7080 పర్సంటేజీల మధ్య సాధించిన విద్యార్థులు - 128
6070 పర్సంటేజీల మధ్య సాధించిన విద్యార్థులు - 168

తెలంగాణలో విద్యావ్యవస్థను ఆగం చేస్తున్నారు: గెల్లు శ్రీనివాస్

విశ్వంభర, హైదరాబాద్ః రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యావ్యవస్థను ఆగం చేస్తున్నారని.. గాడిన పెట్టడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు విద్యా శాఖ మంత్రి లేని కేబినెట్ ఇదేనని విమర్శించారు. విద్యా శాఖను రేవంత్ రెడ్డి తనవద్ద పెట్టుకున్నారని అన్నారు. రాష్ట్రంలో 50మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని తెలిపారు. ప్రియాంక గాంధీతో యూత్ డిక్లరేషన్ ప్రకటించారని.. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. స్కూటీలు ఇవ్వాలని మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. ప్రతి విద్యార్థికి విద్యా భరోసా కార్డు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తామని చెప్పారని.. ఇంతవరకు విడుదల చేయలేదని అన్నారు.ఎమ్మెల్సీ కోదండరాం ఎందుకు మౌనంగా ఉన్నారని.. ఆకునూరి మురళి ఎందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించడం లేదని నిలదీశారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీల దోపిడీ ఎక్కువ అయిపోయిందని.. హైదరాబాద్ నడిబొడ్డున అనేక కార్పొరేట్ కాలేజీలకు పర్మిషన్స్ లేవని తెలిపారు. ప్రయివేటు కార్పొరేట్ కాలేజీలపై రేవంత్ రెడ్డి నోరు విప్పాలన్నారు.